క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ముత్యాలంపాడు ఫీడర్ పరిధిలో విద్యుత్‌వైర్ల మరమ్మతులు, కొత్తలైన్ నిర్మాణ పనుల దృష్ట్యా ఆదివారం ఉదయం ఎనిమిది నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్‌రాజు రోడ్డు, ఏఎస్‌రాజు రోడ్డు, కొమ్మువారి వీధి, బ్రహ్మయ్యపంతులు వీధి, సుమానం వారి వీధి, అమలిస్కూల్, మారుతీ వ్యాయామశాల, భగత్‌సింగ్ రోడ్డు, జనార్ధన రావు వీధి, పాపరాజు, కనకరాజు, కావూరు వారి వీధి, నర్రావారి వీధి, దేవాలయం వీధి, వానపాల వారి వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్‌లో పలుచోట్ల రోడ్డులో ఏర్పడిన గోతులకు శనివారం అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. ఇక్కడ పలు చోట్ల రోడ్లు గోతులు పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఇటీవల జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే మాల్లాది విష్ణు అధికారులతో మాట్లాడి గోతులను సరిచేయాలని ఆదేశించారు. దీంతో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించారు.

నేత్ర పర్వంగా నాద సంగమం

విజయవాడ కల్చరల్: త్రిపుర కల్చరల్ ఆర్ట్స్, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్, అన్నమయ్య పరివార్ ఆధ్వర్యంలో సత్యనారాయణపురం సీతారామా కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన సాంస్కృతిక సంగమం నేత్ర పర్వంగా సాగింది. బీ లక్ష్మీనారాయణ భగవద్గీతను గానం చేశారు. భక్తి రంజని కార్యక్రమంలో వీ సత్యనారాయణ, బొమ్మరాజు వెంకట్రావ్, రామచంద్రరావు, పొణ్యం శ్రీనిధి అన్నమయ్య, రామదాసు కీర్తనలు గానం చేశారు. హరికథా గానంలో భాగంగా ఏలూరుకు చెందిన ఎస్.భారతి భక్త అంబరీష, కూచిభట్ల వెంకటరమణ కుమార్ భక్తపోతన, తాడేపల్లిగూడెనాకి చెందిన ఎ.శారద కభక్త మీరాబాయి కథలను వినిపించారు. మెహర్ నృత్యనికేతన్, వేదాంతం పార్థసారథి బృందం సంప్రదాయ కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. సాంస్కృతిక, కళారంగాలకు చెందిన సింహాద్రి బాలకృష్ణారావు, ఉమాదేవి, వేదాంతం పాండురంగ శర్మ, వేదాంతం పార్థసారథిని సత్కరించారు.

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు


రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శిరీష

మధురానగర్(విజయవాడసెంట్రల్): నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు పనులను నిర్దేశించిన సమయంలో పూర్తిచేయాలని 31వ డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యం సూచించారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో రూ.31.13 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను శనివారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు సచివాలయం సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు దొంగతనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వాకింగ్‌కు వెళ్లి వస్తున్న మహిళ మెడలో గొలుసు దొంగతనానికి పాల్పడిన ఘటన భవానీపురం పోలీసుస్టేషన్ పరిధిలోని నాలుగు స్తంభాల సెంటర్‌లో చోటు చేసుకుంది. నాలుగు స్తంభాల సెంటర్‌కు చెందిన దేసు మాణిక్యమ్మ శనివారం ఉదయం వాకింగ్‌కు వెళ్లింది. తిరిగి ఇంటికి వెళ్తుండగా సందు చివర బడ్డీ కొట్టు వద్దకు కుమారి వచ్చే సరికి ఆమె మెడలో బంగారు నాను తాడును లాగినట్లు అనిపించింది. వెనక్కు తిరిగి చూసే సరికి బండిపై మంకీ క్యాప్ పెట్టుకున్న వ్యక్తి బండి ఎక్కి అక్కడ నుంచి పారిపోయాడు. దీనిపై భవానీపురం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. తన మెడలో గొలుసు (నాను బాడు + సూత్రాలు కలిపి) ఏడు కాసులు ఉంటుందని, లాగిన సమయంలో నానుతాడు తెగిపోయి కొంత భాగం కింద పడిపోయిదని, మరికొంత భాగం అతని చేతిలో ఉందని ఫిర్యాదులో పేర్కొంది. రెండు బైక్‌లపై ఇద్దరు వ్యక్తులు ఉన్నట్లు పోలీసులకు తెలిపింది. భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే రాష్ట్రం సస్యశ్యామలం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. శనివారం 23వ డివిజన్ 93వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు.

కష్టజీవులకు తోడుగా 'జగనన్న చేదోడు'

పర్యటనలో భాగంగా టైలరింగ్ చేస్తున్న అక్కచెల్లెమ్మలతో మల్లాది విష్ణు ముచ్చటించారు. జగనన్న చేదోడు పథకం ద్వారా రజక, నాయీబ్రాహ్మణ, దర్జీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ముల ఆత్మవిశ్వాసాన్ని ఈ ప్రభుత్వం మరింత పెంచిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో మొదటి, రెండు విడతలు కలిపి 2,021 మందికి రూ.3 కోట్ల వరకు లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు.

నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకోవాలి

టీడీపీ నేత నారా లోకేష్ నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు హెచ్చరించారు. 151 అసెంబ్లీ స్థానాల్లో తిరుగులేని మెజారీతో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్ గురించి మాట్లాడే నైతిక అర్హత.. దొడ్డిదారిన ఎమ్మెల్సీ, మంత్రి అయిన లోకేష్‌కి ఎక్కడిదని ప్రశ్నించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఉన్న మంగళగిరిలోనే చిత్తుగా ఓడిపోయినా లోకేష్ తీరు మారలేదన్నారు. టీడీపీ హయాంలో వేల కి.మీ.రోడ్లు, లక్షలాది వీధిదీపాలు ఏర్పాటు చేసుంటే.. తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో ఎందుకు కనుమరుగైందో నారా లోకేష్ సమాధానం చెప్పాలన్నారు. పైగా ఎన్నికల మేనిఫెస్టోను మాయం చేసిన మీరు.. యూత్ మేనిఫెస్టోను తీసుకువస్తామని ప్రగల్భాలు పలకడం హాస్యాస్పదమన్నారు. కేవలం సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. యువగళం, వారాహి రెండూ ఒకటేనని నారా లోకేష్ మాటలలో మరోసారి స్పష్టమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎవరు ఎవరితో కలిసి వచ్చినా 175 స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరి సుబ్బారావు, నాయకులు చల్లా సుధాకర్, వెన్నం రత్నారావు, పసుమర్తి రాజేష్, ఆత్మకూరి వెంకట అప్పారావు, కొల్లిపర శ్రీను, చాందిని పాల్గొన్నారు.

నిష్ణాతులైన అధ్యాపకులతో బోధన

జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు సబ్జెక్టులపై పట్టు సాధించేలా నిష్ణాతులైన అధ్యాపకులతో విద్యాబోధన అందించి, ఉత్తమ ఫలితాలను సాధించడంతో పాటు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా తీర్చిదిద్దుతున్నామని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పేర్కొన్నారు. స్థానిక పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం కలెక్టర్ సందర్శించి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సంబంధించి బోధనను పరిశీలించారు. జువాలజీ, బోటనీ సబ్జెక్టులపై జిల్లా కలెక్టర్ విద్యార్థులకు పలు ప్రశ్నలను అడిగి సమాధానాలను రాబట్టి విద్యా బోధనపై సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు వారు ఎంచుకున్న సబ్జెక్టులపై పూర్తి పట్టును సాధించేలా ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో విద్యాబోధనను అందిస్తున్నామన్నారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక బోధన అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించినట్లు తెలపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి పెట్టి అధునాతన భవనాలను నిర్మించి మౌలిక వసతులను కల్పించడంతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో విద్యాబోధనను అందించడం జరుగుతుందన్నారు. నాడు–నేడు ద్వారా జిల్లాలో 598 పాఠశాలలు, కళాశాలల భవనాలను కోట్లాది రూపాయల వ్యయంతో ఆధునికీకరించి, పాఠశాలల రూపురేఖలను మార్చినట్లు పేర్కొన్నారు. పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారు రూ.60లక్షల అంచనాలతో అదనపు తరగతి గదుల నిర్మాణం, గదుల మరమ్మతులు, టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, గ్రీన్ చాక్ బోర్డుల ఏర్పాటు, తాగునీరు సౌకర్యం కల్పించడంతో పాటుపెయింటింగ్ పనులు పూర్తి చేయనున్నట్టు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి, అధ్యాపకులు కె.బాలరాజు, ఎం.నిర్మలజ్యోతి, కె.శేఖర్‌బాబు, డి.సంధ్యారాణి, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.గంగరాజు, తహసీల్దారు సీహెచ్ దుర్గాప్రసాద్, వీఆర్వోలు నరేంద్ర, చైతన్య, జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి


ప్లకార్డులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్: మత్తు పదార్థాలు జీవితాన్ని చిత్తు చేస్తాయని, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రమణమూర్తి సూచించారు. 'సే నో టు డ్రగ్స్' కార్యక్రమంలో భాగంగా క్రీస్తురాజుపురంలోని క్రైస్ట్ ద కింగ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమణమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరా ముఠాను ఆట కట్టించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం విద్యార్థులు 'సే నో టు డ్రగ్స్' ప్లకార్డులను ప్రదర్శించారు. కార్యక్రమంలో మాచవరం సీఐ బి.గుణరాము, ఎస్ఈబీ సీఐ స్వామినాథం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందరికీ అందాలి

లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ


మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వివిధ పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులను ఒత్తిడి గురిచేయడం సరికాదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ పేర్కొన్నారు. శనివారం రాత్రి సిద్ధార్థ ఆడిటోరియంలో సిద్ధార్థ అకాడమీ, వికాస విద్యా సంస్థ సంయుక్తంగా నాణ్యతకు నోచుకోని చదువులెందుకు? అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు చదలవాడ నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పిల్లల చదువు కోసం ప్రతి కుటుంబం అధికంగా డబ్బును ఖర్చు చేస్తోందన్నారు. అందుకు కులం, మతం, ప్రాంతం భేదం లేదన్నారు. తమ పిల్లల బాగు కోసం ప్రాణాలైన ఇస్తామనే విధంగా మన దేశంలో తల్లిదండ్రులకున్న భావనలు ప్రపంచంలో ఎక్కడా లేవన్నారు. పాఠశాల విద్య కోసం కేంద్రం ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. తెలంగాణాలో మనబడి, ఆంధ్రప్రదేశ్‌లో అమ్మ ఒడి, నాడు–నేడు పథకాల ద్వారా పాఠశాల స్థాయి విద్యకు అధికంగా నిధులు ఖర్చు చేస్తున్నారన్నారని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అడిగిన ప్రశ్నలకు జయప్రకాష్ నారాయణ సమాధానమిచ్చారు.

రగ్బీ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్టీవీఆర్ పాఠశాల సిబ్బంది

మధురానగర్(విజయవాడసెంట్రల్): కర్నూలు జిల్లాలో ఈనెల 29 నుంచి వచ్చే నెల రెండో తేదీ వరకు జరగబోయే 66వ ఎస్‌జీఎఫ్‌ఐ ఏపీ స్టేట్ అంతర్‌జిల్లా చాంపియన్‌షిప్ పోటీలకు ఎస్టీవీఆర్ విద్యార్థులు శనివారం బయలుదేరి వెళ్లారు. ఈనెల 20వ తేదీన జెడ్పీ హైస్కూల్ ముస్తాబాద్‌లో జరిగిన ఉమ్మడి కృష్ణాజిల్లా జీఎఫ్‌ఐ రగ్బీ సెలక్షన్స్‌లో ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. పోటీలలో ఎస్టీవీఆర్ విద్యార్థులు ప్రతిభని ప్రదర్శించి ఉమ్మడి కృష్ణాజిల్లా అండర్–14, అండర్–17, విభాగాలకు ఎంపికయ్యారు. అండర్–14 బాలికల విభాగంలో సారిక సర్వజ్ఞ, కె.ప్రవల్లిక, బాలుర విభాగం నుంచి జొన్నాడ వెంకటేష్ ఎంపికయ్యారు. అండర్–17 బాలుర విభాగంలో మరడ పవన్ కుమార్ స్టాండ్ బై గా బాలికల విభాగంలో బీ దివ్య, బత్తుల ఉదయ్‌కిరణ్ సెలెక్ట్ అయ్యారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు తెలిపారు. పోటీలకు బయలు దేరిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం ఎం.సూర్యప్రభ, స్టాఫ్ సెక్రటరీ ఎస్వీ శ్యామ్ ప్రసాద్, శ్రీనివాసరెడ్డి అభినందించారు.

20న 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్ష


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): పదో తరగతి విద్యార్థులకు ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు ప్రజ్ఞా వికాసం పేరుతో మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సి.హెచ్. వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం గవర్నర్‌పేటలోని బాలోత్సవం భవన్‌లో సోమవారం ప్రజ్ఞా వికాసం పరీక్షకు సంబంధించి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి మనోధైర్యాన్ని నింపేందుకు ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు పర్యవేక్షణలో ప్రతి సంవత్సరం పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 10వ తరగతి సిలబస్ నుంచి లెక్కలు 20 మార్కులు, ఎన్ఎస్ 10, పీఎస్ 10, ఇంగ్లిష్ 20, తెలుగు 10, హిందీ 10, సోషల్ 20 మార్కులు చొప్పున మొత్తం 100 మార్కులకు ఒక మార్కు ప్రశ్నా పద్ధతిలో పరీక్ష ఉంటుందని తెలిపారు. తెలుగు, ఇంగ్లిషు మీడియాల్లో పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష రిజిస్ట్రేషన్ ఫీజు రూ.25 ఉంటుందని పేర్కొన్నారు. 90108 49524, 93947 55525లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుందరయ్య, కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా ఉచితంగా న్యాయ సేవలు

ఏపీ హైకోర్టు జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్


మాట్లాడుతున్న హైకోర్ట్ జడ్జి జస్టిస్ వి.ఆర్‌కె. కృపాసాగర్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): న్యాయ సహాయం అవసరమైన వారు జిల్లా న్యాయ సేవల అధికారులను సంప్రదించవచ్చని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ డాక్టర్ వీఆర్‌కే కృపాసాగర్ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో కొత్తగా ఎంపికైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం శిక్షణ కార్యక్రమాన్ని హైకోర్టు జస్టిస్ డాక్టర్ సీఆర్‌కే కృపాకర్ సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రయల్ ఖైదీలు, దోషిగా ఉన్న ఖైదీల బెయిల్ దరఖాస్తులు, ట్రయల్ నిర్వహించడం, అప్పీళ్లను నిర్వహించడం మొదలైన వాటి ప్రయోజనాల కోసం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సిస్టమ్ ప్రవేశపెట్టినట్లు చెప్పారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సేవలు పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో పని చేస్తుందన్నారు. ఖైదీలకు చట్టపరమైన సహాయం, సలహాలు అందించాలన్నారు. న్యాయపరమైన అంశాలలో సలహాలు, సూచనలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెంబర్ సెక్రటరీ ఎం.బబిత, నూతనంగా ఎంపికైన లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి



విజయవాడ స్పోర్ట్స్: మోటారు వాహనాలు నడిపే వ్యక్తులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని ట్రాఫిక్ ఏసీపీ జె.వెంకటనారాయణ అన్నారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని బందరు రోడ్డులోని బెంజిసర్కిల్, పీవీపీ సర్కిల్ ప్రాంతాల్లో వాహన చోదకులకు శనివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

హెల్త్‌కేర్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు హెల్త్‌కేర్ క్లినిక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సిద్ధార్థ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాస విఠల్ రావు సూచించారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం సిద్ధార్థ మెడికల్ కళాశాల సహకారంతో హెల్త్‌కేర్ క్లినిక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోగలరన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించుకునేందుకు హెల్త్‌కేర్ క్లినిక్ ఉపయోగపడుతుందన్నారు. కళాశాల అధ్యాపకులు డీ జ్యోతి, కె అరుణ,కె రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట


విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి వచ్చిన ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది, మేయర్ భాగ్యలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో అయ్యప్ప స్వామి గుడి ఎదురుగాగల వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్మించిన ఉత్తరాభిముఖ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రీవారు, గరుత్మంత, జీవధ్వజ, విమాన శిఖర ప్రతిష్ట వైభవంగా జరిగింది. రథసప్తమి పర్వదినాన వైఖానస ఆగమోక్త ప్రకారం వైదిక పూజలు, పండితోత్తముల వేదపారాయణతో సన్నాయి మేళ తాళాలతో 'ఓం నమో వేంకటేశాయ' అనే దివ్య నామస్మరణతో గొల్లపూడి గ్రామం మారుమోగింది. అనంతరం వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమానికి పశ్చిమ, సెంట్రల్ ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ(కొండపల్లి బుజ్జి), ఆలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి దేవతి నాగేశ్వరరావు, దేవాలయ నిర్మాణ దాత నీలి సతీష్‌కుమార్, జొన్నలగడ్డ శివప్రసాద్, నీలిశెట్టి చెన్నకేశవులు, సత్యనారాయణ, సురేష్, పొత్తూరి మణికంఠ, ఆదిశేష గుప్తా, శ్రీనివాస్, లక్ష్మణరావు, స్వరూప్‌కుమార్, శ్రీనివాసగుప్తా, శివాజీ, వైకుంఠం, వేణు పాల్గొన్నారు.

ఆది దేవా నమస్తుభ్యం..


శివరామకృష్ణ క్షేత్రంలో సూర్యారాధన చేస్తున్న రుత్వికులు


సూర్య నమస్కారాలను చేస్తున్న విద్యార్థులు

విజయవాడ కల్చరల్: రథసప్తమి సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తులతో కిటకిట లాడాయి. అర్చక స్వాములు సూర్యారాధన, సూర్యనమస్కారాలు, ఆదిత్యహృదయ పఠనం, అరుణ పారాయణం నిర్వహించారు. భక్తులు ఆది దేవా నమస్తుభ్యం.. అంటూ స్వామి వారిని దర్శించుకున్నారు.

శివరామకృష్ణ క్షేత్రంలో..

దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో శనివారం రథసప్తమి సందర్భంగా ప్రత్యేక పూజలను నిర్వహించారు. సూర్యయంత్రానికి పూజలు, నవావరణ పూజ. వేదపారాయణ, సూర్యహవనం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి హనుమత్ ప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో..

తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణలంక, సింగ్‌నగర్ పంజాసెంటర్‌లోని పాఠశాలలో ప్రత్యేక అవగాహనా సదస్సులను నిర్వహించారు. విద్యార్థులు సూర్యనమస్కారాలను నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగామ్ కన్వీనర్ సీవీకే ప్రసాద్, వివిధ పాఠశాలల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. –లబ్బీపేట శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించారు.

నేడు వాకర్స్ క్యాబినెట్ ఇన్‌స్టలేషన్

మధురానగర్(విజయవాడసెంట్రల్): వాకర్స్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ఇన్‌స్టలేషన్ ఆదివారం మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్లు వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డీవీఎస్ రామలింగరాజు తెలిపారు. స్థానిక అయోధ్యనగర్ వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు దివంగత సుంకర ఆల్వార్ దాస్ విశాఖపట్నం సముద్ర తీరం వెంబడి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో వాకర్స్ అసోసియేషన్ ఏర్పడటానికి కారణమైందన్నారు. అప్పటి నుంచి వాకర్స్ అసోసియేషన్ ఆయన ఆలోచన, ఆశయాలకు అనుగుణంగా పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇన్‌స్టలేషన్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, వాకర్స్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.పి. రవిచంద్ర, లైలా గ్రూప్ ఆఫ్ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో వాకర్స్‌క్లబ్ క్యాబినెట్ సెక్రటరీ పీవీడీ ప్రసాద్, క్యాబినెట్ ట్రెజరర్, కె.సాయిబాబు, జోన్ చైర్‌పర్సన్, ఎస్‌బీజీఎం ప్రసాద్, అడ్వైజర్ రఘురామ్ పాల్గొన్నారు.

రేపు రాష్ట్ర స్థాయి సఫాయి కర్మచారీ సమ్మేళనం

కృష్ణలంక(విజయవాడతూర్పు): గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 30వ తేదీన రాష్ట్ర స్థాయి సఫాయి కర్మచారీ సమ్మేళనం నిర్వహిస్తున్నామని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి అల్లడి దేవకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథులుగా ఏపీ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు, డీసీపీ (అడ్మిన్) విజయవాడ మోకా సత్యబాబు, స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.శ్యాముల్ జోనాథన్, వార్డు సెక్రటరియేట్ అడిషనల్ కమిషనర్ కైలాస గిరీశం, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎం.రుక్మందయ్య, మురళీకృష్ణ ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ వెంకటస్వామి రాజరపు పాల్గొంటారని తెలిపారు.

మద్యం మత్తులో ఇద్దరిపై దాడి

ఏఆర్ కానిస్టేబుల్ దాష్టీకం

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం మత్తులో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఇద్దరిపై దాడి చేసి గాయపరిచిన ఘటన కృష్ణలంక స్టేషన్ పరిధిలోని లబ్బీపేటలో శనివారం జరిగింది. సేకరించిన వివరాల మేరకు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ గుమ్మడి అప్పారావు లబ్బీపేటలోని పపకీరుగూడెం, గ్యాస్ గూడెం ఎదురు వీధిలో నివసిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను ఏడేళ్ల క్రితం ఇక్కడ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఇల్లు కొనుగోలు చేసి కుటుంబంతో నివసిస్తున్నాడు. నిత్యం అతను మద్యం తాగుతూ చుట్టుపక్కల వారితో గొడవలు పడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీనిపై ప్రశ్నిస్తే నేను కానిస్టేబుల్‌ను, నన్ను ఎవరూ ఏమి చేయలేరంటూ వారిపై వివాదానికి దిగుతున్నాడు. ఈ క్రమంలో శనివారం సాయంత్రం డ్యూటీ దిగి ఇంటికి వచ్చాడు. పూటుగా మద్యం సేవించి వచ్చి పైఅంతస్తులో ఉన్న ఎలిసల ప్రసాద్, అతని మరదలు శాలినిలతో గొడవ పడ్డాడు. తర్వాత బూతులు దిడుతూ కులం పేరుతో దూషిస్తూ బెల్ట్ తీసుకుని ప్రసాద్‌పై దాడి చేశాడు. రాయితో తలపై మోదగా రక్తస్రావమైంది. శాలినిపై గేటు వేయగా ఆమె చేతికి గాయమైంది. స్థానికులు వారిద్దరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చుట్టుపక్కల వారితో తరచూ గొడవ పెట్టుకుంటున్న కానిస్టేబుల్ పక్కింటి వారిపై కక్షతో నవంబర్ నెలలో విద్యుత్ వైర్లను బట్టలు ఆరేసుకునే తీగపై వేశాడని స్థానికులు చెబుతున్నారు. అది గమనించిన స్థానికులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. వారి సీసీ కెమెరాల్లో రికార్డైన దృశ్యాలతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు స్పందించకపోవడంతో కానిస్టేబుల్ వ్యవహారం మరింత వివాదంగా మారింది. కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాల సేకరించారు.

ఘనంగా రథసప్తమి


శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో రథసప్తమి వేడుకలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్‌లోని శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా జరిగాయి. సూర్య నమస్కారాలు, సూర్య ఆరాధన, సూర్యయంత్రం, అరుణ పారాయణం చేశారు. కూచిబొట్ల సుధీర్, దైతా మనోహర్, అన్నంభట్ల రవితేజ, కె చిరంజీవి, కృష్ణ శాస్త్రి పాల్గొని పూజలు చేశారు. శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో సూర్యనమస్కారాలు జరిగాయి. ఉదయం 6గంటలనుంచి ప్రత్యేక పూజలు సూర్యనమస్కారాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షులు దాట్ల వెంకట నరసింహరాజు, ఐ ఎస్ ఎన్ రాజు పర్యవేక్షించారు.